అసలే ఆడ పిల్లల కళాశాల!

అందులో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం!!

రాబోతూన్నది క్రొత్త తెలుగు లెక్చరరు!!!

ఇక చెప్పేదేముంది?

మద్రాసు మెయిలు వచ్చే ముందు కిటకిటలాడే విజయవాడ రైల్వే ప్లాట్‌ఫారమ్‌లా నా నా గందరగోళంగా వుంది క్లాసు!

సొరకాయల్లా కోసి కుప్పలు కుప్పలు పోస్తున్నారు.

ఓ మహాశయా.

మాటలు వేయునేల?

అది అచ్చంగా తెలుగు సినిమా క్లైమాక్సు సీనును తలపిస్తూ యెంతో గడబిడగా వుంది.

మీరు మళ్లీ మాటాడుతే,

అది కాశీమజిలీ కథల్లోని ఒక చిన్న ఆడ మళయాళ సామ్రాజ్యమే!

ఆ సామ్రాజ్యానికి మహారాణి ఉషా రాణి.

మంత్రి శశి (రెఖ), సేనాధిపతి సుశి (శీల).

# సహాధ్యాయుడు

## పి.వి.ఎల్. నరసింహారావు

కొందరు హేమమాలినులై అంగన్యాసకరన్యాసాలు చేస్తూంటే. మరి కొందరు లతామంగేష్కరులై పట్ట పగలే త్యాగరాజును ఖూనీ చేసేస్తున్నారు.

వేరొకచోట మరికొందరు తెనాలి రామకృష్ణ నాటినుండి ముళ్ళపూడి వెంకట రమణవరకూ గల జోక్స్ పరంపరలను పంపరపనాస తొక్కల్లా తీసేసి, లేత

వారు 'తాన' అంటే క్లాసంతా 'తంధానా' అంటుంది.

వాళ్ళకు అల్లరి చెయ్యటం మెయిన్ అవుతే, (ఎప్పుడేనా) చదువుకోవటం సబ్సిడియరీ.

గంట గణగణమన్నది.

తెలుగు లెక్చరర్ రానే వచ్చాడు.

ఆయన, నీలాకాశపు రంగు మార్ల



బిరో టెరీవూల్ సూటు, లేత గులాబీ డాయిక్ టై, బ్రిల్ క్రీమ్‌తో నలగని నిగనిగల జుత్తు....లతో, అచ్చం నేటి కాలపు ఆంధ్రోపన్యాసకుని లా గా నే వున్నాడు.

"హాఁ... చ్" అన్నది ఉష.

"హాఁచ్, హాఁచ్" అన్నారు శశి, సుశి.

'హాఁచ్, హాఁచ్, హాఁచ్' లతో క్లాసు క్లాసంతా ప్రతి ధ్వనించింది.

ఆయన తొణకలేదు.

పెదవులపైని చిరునవ్వు తొలగనూ లేదు.

ఉషారాణి లేచి నిల్చొన్నది.

వయ్యారంగా పైట సర్దుకొన్నది.

విలాసంగా క్రీగంట చూసింది.



"శోక భీకర తిమిర లోకైక పతికి సుస్వాగతం!" అంటూ రాగయుక్తంగా పలుకుతూ నమస్కరించింది. శశి. సుకే ... మిగిలిన ముప్ఫై ఎనిమిదిమంది అమ్మాయిలు ఆమెను అనుకరించారు.

పుస్తకాలు బల్లమీద వుంచి, నల్లబల్ల వైపు తిరిగాడు కొత్త లెక్చరర్.

"శోక భీకర తిమిర లోకైక పతికి సుస్వాగతం" ముత్యాలకోవలాంటి అక్షరాలు అతన్ని వెక్కిరిస్తున్నాయి.

ఆయన యేమీ జరగనట్లుగానే భావించి మృదు మధురమైన స్వరంతో ప్రారంభించాడు: "మీ స్వాగతానికి ధన్యవాదాలు. మీ సాహితీ పరిజ్ఞానానికి అభినందనలు. మా యిరువురి పేర్లూ ఒకటే. అయినా మహాకవి కృష్ణశాస్త్రికి నాకూ హస్తిమ

శకాంతరం వుంది. మీకు తెలుసనుకొంటాను. వారి కంఠం ప్రస్తుతం మూగపోయింది. కాని, హృదయం వేయి గొంతులతో సజీవమైన రచనలు ఆంధ్ర జాతికి వినిపిస్తూనే వున్నది. వారి రచనలతోనే మనం యీ క్లాసు ప్రారంభిద్దాం." అంటూ చక్కని కంఠంతో.

'కారు మొయిళ్ళకాటుక పొగల్....' ఆదిగాగల పద్యాలు, 'ఆకులో ఆకునై ..' మొదలైన గేయాలు పాడటం ప్రారంభించాడు కృష్ణశాస్త్రి.

సంగీతమూ, సాహిత్యమూ సమపాళ్ళలో మేళవించబడిన ఆయన కంఠస్వరం, ఆ విద్యార్థినుల పాలిటి నాగస్వరమే అయి వూరుకొంది.

ఇప్పుడు రైలు వెళ్ళిపోయిన తరువాత కిలాకిలారావం తగ్గిపోయిన ప్లాట్‌ఫారాన్ని తలపించింది క్లాసు.

మళ్లీ ఉషారాణి లేచి నిల్చొన్నది.

"ఎస్, ప్లీజ్" అన్నాడు కృష్ణశాస్త్రి.

"మాష్టారూ! నన్ను విడువుడు.... అనే పద్యాన్ని పాడరూ" అని అడిగింది ప్రాధేయ పూర్వకంగా.

కృష్ణశాస్త్రి యెత్తుకొన్నాడు.

"నన్ను విడువుడు,
ఒకసారి నన్ను విడిచినంత
వెక్కి వెక్కి రోదింతును...."

ఈసారి కృష్ణశాస్త్రి నిజంగానే వెక్కి వెక్కి రోదిస్తున్నాడు.

ఆయన కండ్ల వెంట కన్నీటి భాష్పాలు పన్నీటి జల్లులా రాలుతూనే వున్నాయి.

క్లాసు క్లాసంతా స్థంభించిపోయింది.

శశి లేచి "మేష్టారూ, కోతీ బావకు పెళ్ళంట....అనే పాట పాడరూ...." అన్నది నవ్వుతూ.

ఆ నవ్వుతో కలిపి బిగ్గరగా నవ్వుతూ, "నీ పెండ్లికి నన్ను పిలవటం మరువకేం" అంటూ వేదిక దిగాడు కృష్ణశాస్త్రి బెల్ వినిపించటంతో.

"మాష్టారూ, ఒన్ క్వశ్చెన్ ప్లీజ్."

అందరూ ఆ మాటలు వచ్చిన వైపు తదేకంగా నిశ్చేష్టులై చూడసాగారు.

కొంటెగా, చిలిపిగా, గోముగా చూస్తూ అడిగింది ఉషారాణి....

"మేష్టారూ, మీకు పెండ్లయిందా?"


క్లాసు క్లాసంతా గొల్లుమన్నది.

తనలో తానే నవ్వుకొంటూ వరండాలోకి నడిచాడు కృష్ణశాస్త్రి 'అమ్మయ్యా' అని వూపిరి పీలుస్తూ.

* * *

"ఆఫ్టరాల్ తెలుగు లెక్చరరు" అంటూ అపసోపాలు పడ్డారు, స్నేహితురాండ్రు ముగ్గురూను.

ఎందుకంటే, వారు ఆశించినంత 'గాభరా' తినలేదు కృష్ణశాస్త్రి.




పై పెచ్చు, క్లాసు క్లాసును తన నైపుణ్యంతో ఆకట్టుకోగలిగాడు కూడాను.

"ట్రై ట్రై ఎగైన్, అన్నాడు కాళిదాసు కదూ" అన్నది శశి.

"అవును ప్రయత్నించు ప్రయత్నించు అన్నాడు షేక్స్పియరు కూడాను" అని వంతపలికింది సుశి.

"ఏడ్చినట్లే వుంది మీ బి. సీ. జోక్సున్నూ మీరూనూ, యింతకూ ఏవిటి విశేషాలు" అంటూ సీరియస్‌గా ప్రశ్నించింది ఉషారాణి.

ఉషారాణి ఇన్ఫర్మేషన్ ఆఫీసరు అని అనుకొంటే శశిని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోగాను, సుశిని ఆకాశవాణిగానూ పోల్చుకోవచ్చు. వారు సమాచార సేకరణలోనేగాక, ప్రసారంలో కూడా హేమాహేమీలే. శశి ఫస్ట్ ఇన్‌ఫరమేషన్ కధనం.

'కృష్ణశాస్త్రి బ్రాడీపేట రెండవ లైను పది పదకొండు అడ్డరోడ్ల మధ్య ఒక చిన్న డాబా యింట్లో వుంటున్నాడు. అద్దె ఏభై రూపాయిలు' సుశి సేకరించిన సమాచారం.

'కృష్ణశాస్త్రికి పెండ్లి అయింది. ఒకే

ఒక కూతురు వయసు రెండు లేక మూడేండ్లు ఇంట్లో భార్యా పిల్లా తప్ప వేరే ఎవళ్లూ లేరు.'

'అంతేనా?' అన్నట్లు చూసింది ఉషా రాణి.

'అంతేను' అన్నట్లు చూసారు శశీ, సుశీలు.

"నేను చెబుతాను వినండి." అంటూ మొదలెట్టింది ఉషారాణి.

"కృష్ణశాస్త్రిగారు నూటికి నూరుపాళ్లు భార్యా విధేయుడు. ఆవిడగారికి వల్లమాలిన గర్వం. ఇంట్లో పనంతా యీయనగారే చేస్తారు. వంట మొదలు పిల్లకు పాలు పట్టించటంవరకూ .. అన్నీ భర్తగారు చేస్తూంటే భార్యగారు చూస్తూ వుంటుంది. ఒంటె పిల్లి రాకాసిలా ఆవిడ ఇరుగు పొరుగులతో కలవదు. ఆయన కూడా బైటకురారు. చెడు అలవాట్లు యేమీలేవు సిగరెట్టు కూడా ముట్టుకోరు. టు సమ్ అప్, ఆయనకు గృహమే స్వర్గసీమ" అంటూ దీర్ఘమైన శ్వాస తీసింది ఉష.

"వాట్. " అన్నట్లు ఆశ్చర్యంగా చూసారు శశీ, సుశీలు.

"ఓ, యిదంతా నాకెలా తెలిసిందనేగా మీ అనుమానం ఏమీలేదు. కృష్ణశాస్త్రిగారి నైబరు మా అన్నయ్య విశ్వానికి మంచి ఫ్రెండ్. వీడు జీవితంలో సగభాగం (నిద్రకు బదులు) వాళ్ళ యింట్లోనే గడుపుతుంటాడులే" అంటూ పక పకమని నవ్వింది ఉషారాణి.

* * *


మళ్లీ కృష్ణశాస్త్రిగారి క్లాసు వచ్చింది. అయితే, యిటీవల ఆ క్లాసులో చాలా ఇంప్రూవ్‌మెంటు వచ్చిందని అనిపించి మనసులోనే ఆనందిస్తూ వచ్చాడు ఆయన. మనిషి తనకు తాను తెలియకుండానే కొన్ని పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు వాటినే అసంకల్ప ప్రతీకార చర్యలు అని అంటుంటారు సైన్సు మాష్టర్లు.

అనుకోకుండా నల్లబల్లవైపు కృష్ణశాస్త్రి చూడటం కూడా అలాంటి చర్యల్లో ఒకటే. చక్కని కార్టూను ఒకటి ప్రత్యక్షమై వుంది అక్కడ. భర్త వంట చేస్తూంటే, భార్య సోఫాలో కూర్చొని పత్రిక చదువుతూ వుంటుంది.

దాని క్రింద భార్యా విధేయ సంఘాధ్యక్షుడు (President of Henpecked HusbandsAssociation)అనేCaption వ్రాయబడి వుంది. ఆ భర్తలో కృష్ణశాస్త్రి పోలికలు కొట్ట వచ్చినట్లు అగపిస్తూనే వున్నవి.

ఏమీ పట్టించుకోకుండా, ఎప్పటిలా చిరునవ్వు నవ్వుతూనే పాఠం మొదలెట్టాడు ఆయన.

పాఠ్య భాగం, మనుచరిత్ర ఎంతో రసవంతంగా నడిచిపోతూన్నది.




“అల్లసాని వారి అల్లిక జిగిబిగి, ప్రవరుడి ధీరచిత్తము, వరూధిని పాత్ర చిత్రణ ..” ఉపన్యాసం గంగాప్రవాహంలా సాగిపోతూన్నది.

“కలంచునే సతులమా యికధీర చిత్తంబులన్” అనే పద్యాన్ని చదివి బోధిస్తున్నాడు కృష్ణశాస్త్రి.

“మాష్టారూ! సతి అంటే పతివ్రత కదా? అసలు పతివ్రత ఎలా మాయలు చేస్తుంది? అందులో ప్రవరుడు యేమన్నా పసివాడేమిటి మా యల్లో పడటానికి” అంటూ ప్రశ్నవేసింది అమాయక వదనంతో వున్న శశి.

క్లాసంతా గొల్లుమన్నారు.

కృష్ణశాస్త్రి కూడా వాళ్ళతో కలిపి నవ్వుతూ, “నీవు కట్ట మంచి వారి వ్యాఖ్యానం చదివావని తెలుస్తున్నది. అంత ఇంట్రెస్టు తీసుకోవటం మంచిదే” అంటూ ఆ ప్రశ్నకు జవాబు చెప్పటంలో వుద్యుక్తుడయ్యాడు.

శశి లేచి.

“మాష్టారూ! సతీవ్రతుడు ఏ సమాసం అండి” అని అడిగింది కొంటెగా నవ్వుతూ.

“సతి యే వ్రతముగా కలవాడు బహువ్రీహి అవుతుంది” అని చిరునవ్వు నవ్వి “ఎనీ మోర్ డౌట్స్” అన్నాడు ఆయన.

“ఎసీ ప్లీజ్. ఈ కాలంలో సతీవ్రతులే

గాని పతివ్రతలు లేరట నిజమేనాండి?" అని అడిగింది ఉషారాణి.

"అనుభవం మీద నీకే తెలుస్తుందిలే" అని మళ్లీ నవ్వాడు కృష్ణశాస్త్రి.

అందరూ గలగలమని నవ్వారు.

బెల్ అయింది.

వేదిక మీద నుండి క్రిందకు దిగాడు కృష్ణశాస్త్రి.

స్నేహితురాండ్రు ముగ్గురూ కృష్ణశాస్త్రిగారి దగ్గరకు వచ్చారు.

ఉషారాణి యెంతో వినయం పుట్టిపడేట్లుగా "వచ్చే ఆదివారం మేము అమరావతి పిక్నిక్ వెళుదామనుకొంటున్నాము. మీరూ, మీ శ్రీమతీ తప్పక రావాలండి" అని అడిగింది.

ఒక నిముషం అటూ యిటూ తట పటాయించి "మీరు యెంతో ఆదరంతో నన్నూ, నా శ్రీమతినీ ఆహ్వానించినందుకు చాలా థాంక్స్. కాని, ఈసారికి క్షమించండి వీలుపడదు" అంటూ ప్రిన్సిపాలు రూము వైపుకు నడిచాడు ఆయన.

శశీ, సుశీ ఒకేసారి అడిగారు "ఈ పిక్నిక్ అయిడియా ఏవిటే?" నవ్వుతూ చెప్పింది ఉషారాణి—

"ఏమీలేదు, మా మేనత్త అంటూ వుండేది. హెన్ పెక్కడ్ హస్బెండ్ చెయ్యి, సూర్యకాంతం నోరూ చచ్చినా వూరుకోవట. ఒక రోజు మనతో కలిసి వుంటే మన మాష్టారు ఏపాటి సతీవ్రతులో మనకు తెలిసి వుండేది. అది పసి కట్టే చల్లగా తప్పించుకున్నారు మాష్టారు దాంతో, గిరీశం అన్నట్లు డామిట్ కథ అడ్డం తిరిగింది."

"అవును. అడ్డం తిరిగింది" అని అంగీకరించారు శశీ, సుశీలు.

* * *

నిన్నటి మహానాయకుల మస్తిష్కాలు ఎన్నికల కురుక్షేత్రంలో రాలి పాలి పోయినవి.

రాష్ట్రాలల్లో ప్రతి పక్షాల ప్రభుత్వాలు పేక మేడల్లా కూలిపోతూన్నవి.

బంగ్లాదేశం స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. ఆ మహాయజ్ఞంలో ప్రాణాలు సమిధలుగా సమర్పిస్తున్నారు. దేశభక్తితో పులకరించిపోతూన్న స్త్రీ పురుషులు అయినా—

కాలం ఎప్పటిలాగానే—

ఏమీ పట్టనట్లు పారిపోతూనే వున్నది.

"జీవితం ఎంతో విచిత్రమయింది!" అని అనుకున్నది రెండోసారిగా, రెండంతస్తుల మేడ మీది ఎయిర్ కండిషన్డు గదిలో కూర్చొని ఐస్‌క్రీమ్ సేవిస్తూన్న ఉషారాణి. లేకపోతే, తనకు యీ అర్థం పర్థంలేని ఆలోచనలేవిటి?

అణగ కొడుతూన్న కొద్దీ పైకి లేచే బంతిలా, మనస్సులో నుండి పై పైకి తొంగి చూస్తూనే వున్నాయి చిత్రమైన ఊహలు.

నిజమే. తను కొంటె కోణంగిగా పేరు తెచ్చుకొన్నది కళాశాలలో లెక్చరర్లను ఏడిపించటం తనకు వెన్నతో పెట్టిన విద్యే.అందులో ఏ మాత్రం అసహజమూ లేదు.

కాని, అలా యేదో తమాషాగా ప్రారంభమైన యీ తతంగం అంతా—

మరో మలుపు తిరిగిందా అని అనిపించింది. లేకపోతే, తన మనస్సును కృష్ణశాస్త్రి రూపం సూదంటిరాయిలా ఆకర్షిస్తూన్నట్లు యిటీవలే తెలుసుకొన్నది ఉషారాణి.

“కొంపతీసి తను గనుక ఆయన్ను ప్రేమించటం లేదు కదా?”

ఆ వూహ వస్తే మామూలుగా అయితే విరగబడి నవ్వి. యితరులను కవ్వించి వుండేది.

ఈసారి నవ్వు రాలేదు సరి కదా, ‘గుడ్ గాడ్’ అనే గాఢమైన నిట్టూర్పు మాత్రం వెలికి వచ్చింది.

“ఏమిటే గుడ్‌గాడ్ అంటున్నావు.” అంటూ ఒకేసారి లోపలకు వచ్చారు శశీ, సుశీలు.

“అబ్బే ఏమీలేదే” అంటూ నిట్టూర్చింది ఉషారాణి.

“అహా, ఏమీలేదట. విన్నావే సుశీ రిటైర్డు హైకోర్టు జడ్జిగారి ముద్దుల కూతురు, కొండమీది కోతి కావాలంటే యిట్టే రప్పించగల అన్నయ్యా గల యీ ఉషారాణి దీనవదనాన్ని చూస్తుంటే....” శశి, పలుకులకు అడ్డు తగులుతూ—


“కొండమీది కోతి కాదే! నేలమీది కోతి బావ కావాలే నెచ్చెలి?” అంటూ నాట్యం చేసింది సుశీ.

“ఏమిటే మీ అల్లరి ?” అంటూ విసుక్కొన్నది ఉషారాణి.

“ఏమీ లేదు కొంప తీసి నీవు గాని ఆయన్ను గనుక ప్రేమించేసావా అని అనుమానం వచ్చింది మా యిద్దరికీ.” అంటూ తన ఊహను వెళ్ళడించింది శశి.

“ఏమిటి, ఆ అర్థం లేని వాగుడు? అది సరే కాని, ఎనీ మోర్ న్యూస్!” అని సంభాషణను మళ్ళించింది ఉషారాణి.

“నో న్యూస్ యీజ్ గుడ్ న్యూస్ మై డియర్. ఈ కృష్ణశాస్త్రి అనే చిరు



నవ్వులు వెదజల్లే చందమామ వున్నాడే! తల్లిని తండ్రిని వదిలేసాడు. కనీసం చెల్లెల్నయినా ఒకసారి యింటికి తెచ్చి చీరె పెట్టిన పాపాన పోలేదు. రకరకాలు గదా భార్యా విధేయులు" అంటూ రాగ యుక్తంగా పాడింది సుశీల.

"ఏమోనే నాకు ఎందుకనో ఆయన అంత దుర్మార్గుడిగా అవుపించటంలేదు." అన్నది నిర్లిప్తంగా ఉషారాణి.

"ఎందుకనే?" అంటూ ఏక కంఠంతో ప్రశ్నించారు స్నేహితురాండ్రు.

"ఏమో నాకలా అనిపించింది అంతే" అంటూ ముక్తసరిగా ఆ సంభాషణను తుంచేసింది.

అంతలో ఉషారాణి అన్నయ్య విశ్వం హడావుడిగా వస్తూ—

"ఇది విన్నావా ఉషా!" అన్నాడు ఆదుర్దాగా.

"ఏమిటన్నయ్యా!" అని అడిగింది. ఆశ్చర్యంతో ఉషారాణి.

"ఉషా! ఎంతో దారుణమైన వార్త. కృష్ణశాస్త్రిగారి భార్య వంటింట్లో అగ్ని ప్రమాదానికి గురియై చనిపోయింది సాయంత్రమే!"

"హా ...." అంటూ నోర్లు తెరుచుకొని అట్టే విస్తుపోయారు ముగ్గురు స్నేహితురాండ్రున్ను. చివరకు తేరుకొని—

"ఏమిటి యిది నిజమే. అసలు ఏం జరిగిందన్నయ్యా!" అని ప్రశ్నించింది వణుకుతూన్న కంఠంతో ఉషారాణి.

"అమ్మా, అదంతా నిజంకన్నా వింత అయిన విషాద గాథ. కృష్ణశాస్త్రిగార్కి-వివాహమైన నాల్గయిదేండ్లల్లో భార్యకు బోన్ టి. బి. వచ్చి రెండు కాళ్లు అవిటివి అయిపోయాయి. పూర్తిగా ఇన్‌వేలిడ్ అయిపోయింది. తల్లి దండ్రులు ఆవిడను వదిలేసి మరో పెళ్ళి చేసుకోమని యెంతో పట్టు పట్టారు. చివరకు భార్య కూడా 'నావల్ల మీకు యే సుఖమూలేదు, మరో పెండ్లి చేసికోండని' పోరసాగింది.

కృష్ణశాస్త్రి 'ససేమిరా' అన్నాడు

---

## రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు ప్రచురణార్హము కానిచో త్రిప్పి పంపగోరు వారు తగినన్ని స్టాంపులు అతికించిన కవర్లు జతపరచి పంపవలసిదిగా కోరు తున్నాము. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

కథలు పుల్‌స్కేప్ సైజులో పది పేజీలు. వ్యాసాలు నాలుగు పేజీలు మించకుండా పంప ప్రార్థన.

—ఎడిటర్.

దాంతో తల్లి దండ్రులే కాదు, అటువైపు కాకి కూడా యిటువైపు వాలటం మానేసింది. ఆయన హృదయం సముద్రం, మనస్సు నవనీతం. బాధలోనే సౌఖ్యం అనుభవించగల మహామనిషి ఆయన లోపల యిన్ని కష్టాలను ఎదుర్కొంటూ, భార్యకు సేవచేస్తూ, నవ్విస్తూ నవ్వుతూ కాలాన్ని నెట్టుక వస్తున్నాడు," అంటూ నుదిటి మీది చెమటను కర్చీఫ్‌తో తుడుచుకోసాగాడు విశ్వం.

ఏదో అద్భుతమైన కల్పనా కథ వింటూన్నట్లు ఏకాగ్రతతో విశ్వం వైపు చూస్తున్నారు ఆ ముగ్గురూ.

"భర్తకు తగిన భార్య. తనవల్ల భర్తకు సుఖం లేదనీ, తను యింట్లో పని యేమీ చేయలేకపోతున్నాననీ మనస్సులోనే కుమిలిపోతూ వుండేది. ఇలా వుండగా కృష్ణశాస్త్రిగారి క్లాసులో ఎవరో పిల్లలు కార్టూను వేసి 'భార్య విధేయుడని' వేళాకోళం చేసారట. ప్రక్కింటి వారి ద్వారా ఆ సంగతి తెలుసుకొన్న ఆయన భార్య యెంతో మదన పడిపోయింది.

"ఎలాగైనా యివాళ సాయంత్రం భర్త వచ్చేలోపల వంట చేసేయాలనే నిశ్చయంతో అలాగే గోడ పట్టుకొని వంటింట్లోకి నడిచి స్టౌ వెలిగించిందట. కాని, నిలద్రొక్కుకోలేక పోవడంతో స్టౌ మీద పడి వళ్ళంతా కాలిపోయింది. ప్రక్కింటి వారికి తెలిసి మంటలార్పేసరికి పరిస్థితి ప్రమాదించింది. తనంతట తను అవిటి స్త్రీ యెలా మంటలార్పుకోగలదు?

కృష్ణశాస్త్రి యింటికి వచ్చి భార్య వున్న పరిస్థితిని చూసి 'బోరు'మన్నాడు.

అంబులెన్సు వచ్చింది.

కాని, దాని అవసరం లేకుండానే పోయింది. నిజంగా ఆ మానవుడు చేసి నిస్వార్థ సేవకు భగవంతుడు ప్రసాదించిన ప్రతిఫలం యిదేనా అని అనిపిస్తుంది. వళ్ళూపై తెలీక వెక్కి వెక్కి ఏడుస్తున్నాట్ట" అంటూ ముగించాడు విశ్వం.

"నన్ను విడువుడు

ఒకసారి నన్ను విడిచినంత వెక్కి వెక్కి రోదింతును"....అని పద్యం పాడుతున్న కృష్ణశాస్త్రి రూపం వారి ముగ్గురి కళ్ళ ముందు సాక్షాత్కరించింది.

ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగా లేచి నిల్చొన్నది ఉషారాణి.

"శోకభీకర తిమిరలోకైక పతికి స్వాగతం" పలికిన ఉషారాణి రూపం కండ్లకు కట్టినట్లయింది శశికి సుశీకి.

"ఏమిటి ఉషా?" అన్నాడు విశ్వం యెంతో ఆశ్చర్యంతో.

"ఏం లేదు అన్నయ్యా, నాన్నగారితో చెప్పు కారు తీసికెళ్లుతున్నానని." అంటూ రెండేసి మెట్లు ఒకేసారి గెంతుతూ గారేజి వైపుకు పరుగు తీసింది ఉషారాణి.

